# ప్రకృతి

రివైజ్డ్

హైకూలు



గిన్నెల ప్రమోద్ కుమార్

# ప్రకృతి

## రిపైజ్డ్

(హైకూలు)

గిన్నెల ప్రమోద్ కుమార్

*

సూర్యుడు

అస్తమిస్తున్నాడు

వేరే చోట ఉదయించడానికి

*

మదిలో ఆనందం,

కుండీలో పువ్వు

విరబూస్తున్నాయి

*

తరిగిన అడవి

తప్పదు

మనిషికి శిక్ష

*

అడవిలో నడక,

ఆహ్లాదం

ఆనందం

*

అడవి ఒడిలో
ఒదిగిపోయిన
అయిదు గుడిసెలు

*

ఒక్కసారిగా
పైకెగిరాయి పక్షులు
సమావేశం ముగిసిందేమో..

*

మనిషికీ ప్లాస్టిక్ కీ తేడా,

ప్లాస్టిక్ భూమిలో

కలిసిపోదు

*

వాన చినుకులు

సూటిగా

ధాటిగా

*

రోడ్డు విడదీసినా

చెట్లు కౌగిలించుకుంటున్నాయి

పై కొమ్మలతో

*

అడవిలో రాలిన

ఎండుటాకుల తివాచీ

అగ్గి పడితే లేదు పూచీ

*

చిన్నప్పుడు ఆడుకున్న

ఊడలమర్రి

ఇప్పుడు లేదు

*

పలిగిన కాయల్లోంచి

పత్తి పొంగుతోంది

పాల నురగలా

*

పెద్ద పెద్ద బండ రాళ్లు

కుప్పగా పోసి,

కొండ

*

అమ్మాయి

శిరోజాలు,

సముద్ర అలలు

*

పొద్దుతిరుగుడు పూలు

సమావేశంలో

ప్రేక్షకులలా

*

పట్టణీకరణలో

ప్రకృతి కూడా

కృత్రిమమే

*

అడవే బతుకు

అడవి జంతువుకైనా

బయటి జంతువుకైనా

*

మహావృక్షాలు

పొగమంచు

ముసుగేసుకుని

*

వరుసకట్టి

పడుతున్నాయి

నీటి బిందువులు

*

బండరాయి ని

ఢీకొని అల

ముక్కలు చెక్కలు

*

ఆకాశం లో

మేఘాల

వర్ణ చిత్రం

*

ఆకుపచ్చని

సముద్రం,

అడవి

*

ధ్యానం,

పచ్చని ప్రకృతిలో

విశ్రాంతి, మనశ్శాంతి

*

వేప చెట్టు కింద

ఒక సూక్ష్మ

వాతావరణం

*

రేపటి వృక్షాలు

ఎదుగుతున్నాయి

నర్సరీలో

*

దూరపు కొండలు

ఇటువైపే

చూస్తున్నాయి

*

సూర్యుడు సైతం

చలికాలం

చల్లగా మెల్లగా, బద్ధకంగా

*

ఏది పుట్టినా

మట్టినుంచే,

కలిసేదీ మట్టిలోనే

*

కొండల్లో పల్లె
కప్పుకుంది
మంచు దుప్పటి

*

గుహలోంచి
బయటికి ప్రవహిస్తున్న
అంతర్వాహిని

*

మహావృక్షం కింద

సేద తీరుతున్న

కట్టె బెంచీ

*

భారంగా కిందకు

జారుతోంది

ఆకు పై నీటి చుక్క

*

వర్షాల వల్ల

కొండలపై

కొత్త జలపాతాలు

*

పూర్తిగా నిండిన

చెరువు,

చల్లగా ఏసీ గాలి

*

పచ్చిక మధ్యలో

పిరమిడ్ లలా

బండరాళ్ళు

*

మైదానం లో

పచ్చగడ్డి, పిల్లగాలుల

పలకరింపులు

*

అనంతాకాశం
విశాలమైన పంట చేనులో
ఒకే ఒక గుడిసె

*

చెట్టు పట్టు లేని
భూమి
క్రమంగా కోత

*

ఒక్కో పువ్వు
ఒక్కో అందం
పురాతన సాంకేతికత

*

ఆకుల్లో రంగులు
లేతవి, పెరిగినవి,
రాలేవి

*

గడ్డకట్టిన
సెలయేరు
పరుగులకు విశ్రాంతి

*

కొండవాలు నుంచి
ఆకాశం చూపు
కొబ్బరి చెట్టు

*

సిల్వర్‌ఓక్ ఆకులు

వెండి

తళతళలు

*

విత్తనం

భూమిని చీల్చుకుని,

జీవం నేనున్నానని

*

వర్షాకాలం అడవికి

పండగొచ్చింది

కొత్త ఆకులు తొడిగింది

*

కొండవాలు

కోసుకుపోయింది

పచ్చదనం లేక

*

గడ్డిపూల అందాలు
గులాబీ
చామంతిలకేం తక్కువ

*

ఆకాశాన్ని తనలో
చూపిస్తోంది
చెరువు అద్దమై

*

లోతైన లోయలో

అట్టడుగున

సన్నటి నీటి పాయ

*

ముళ్ళ చెట్టుపై

ముచ్చటగా

పక్షుల గూళ్ళు

*

నదీ సంగమం

ఎటు చూసినా నీళ్ళే

దూరంగా గుట్టలు

*

మహావృక్షం

ఓ గొడుగులా

ఆకుపచ్చని కొండలా

*

మహా మఱ్రిమాను
అన్నీ ఊడలే
మొదలెక్కడుందో

*

ఆరు నెలలుండే
చుట్టాలు
సైబీరియా కొంగలు

*

ఆకాశంలో

పక్షుల జంట

ఆనంద విహారం

*

పాపం ఆ అల

నా కాళ్లను

అందుకోలేకపోయింది

*

కోట బురుజును

ఆక్రమించింది

మఱ్ఱి చెట్టు

*

పెద్దపులి

పెద్ద లాభం

అడవికీ, మనిషికీ

*

చిత్రకారుని

పనితనం

సీతాకోకచిలుక రెక్కల్లో

*

పెద్దపులి మార్గం

అదే

రాజమార్గమే

*

వెదురు పొదలలో

అద్భుతమైన

వేణు నాదం

*

పదవీవిరమణ

చేశాయి,

రాలిపోయిన ఆకులు

*

అరణ్యంలో

నీటి కుంట

ఒక మజిలీ

*

చిట్టడవిలో

చెల్లాచెదరుగా

సూర్యకాంతి

*

వృత్తలేఖిని తో
గీసినట్టు
ఇంద్రచాపం

*

పువ్వుల చెట్టు
కింద కుర్చీపై
పూలవాన

*

తీగలు,

పెనవేసుకునే

బంధాలు

*

రైలు కిటికీ అవతల

కదిలి పోతున్న

ప్రకృతి

*

కొండల్లోంచి బండల్లోంచి

వాగులై వంకలై

మహానదులై

*

ఇసుక తిన్నెలపై

గాలి గీసిన

వక్రరేఖలు

*

రాత్రిపూట
మహానగర దృశ్యం
మరో పాలపుంత

*

అడవిలో
ఇసుక మేట
వాగు మలుపు

*

గుత్తులుగా

కాసిన కాయలు

కొమ్మలకు బరువై

*

పొగమంచులో

చెట్టు దృశ్యం

కొమ్మలు అదృశ్యం

*

నల్లరేగడి నేల
పగుళ్లు
నిర్జీవ చిత్రం

*

కొండవాలుపై
పచ్చికల
నృత్య విన్యాసం

*

వాన చినుకుల్లో
ఎండుటాకు
ప్రయాణం

*

తపస్సులో ఉన్న
మహాఋషి,
మహావృక్షం

*

పోడు

నరుకుళ్ళు,

మారణహోమం

*

శిశిరం

ఆకులు లేని

బోసి చెట్లు

*

రాలింది

ఇప్పపువ్వు,

కమ్మని వాసన

*

మోదుగ

పూలు

అగ్నిజ్వాల

*

పసుపు రంగు

పూలు కప్పుకుంది

ఓ అడవి చెట్టు

*

ఎత్తయిన చెట్లపై

తేనెటీగల

కాలనీలు

*

జనావాసంలోకి

తప్పిపోయి వచ్చిన

జింకపిల్ల

*

పచ్చని చెట్ల కింద

ప్లాస్టిక్ చెత్త,

మనిషి దురాక్రమణ

*

కేబుల్ కారులో

360 డిగ్రీల

ప్రకృతి

*

అడవి

మధ్యలో

గిరిజన దైవం

*

ప్రకృతి వ్యర్థాలు

మట్టికి బలం

మానవ వ్యర్థాలు?

*

నదీ తీరాలు

మనిషి

కాలుష్యం

*

రాత్రిపూట

అడవిలో మంటలు

సుందర విధ్వంసం

*

జలపాతంలో

తడవడం

పారవశ్యం

*

గులాబీపై
వాలిన బూగ,
ఏం పనుందో

*

సహజ వంతెనలు,
ప్రకృతి శక్తుల
నిర్మాణాలు

*

అడవిలో

ఏదో తీగ చెట్టు

ఊయల

*

ఆకుపచ్చని

నాచు కప్పుకున్న

బండరాయి

*

కొండల మధ్య
రైలు పట్టాల
సహజీవనం

*

దోసిలితో
ఎత్తి పోస్తున్నట్లు
జలపాతం

*

ప్రశాంతంగా

ఆకాశం

సాగరం

*

ఎడ్లబండి బాట

ప్రకృతి

ఇచ్చిన తోవ

*

నిర్మలమైన

చెరువు నీటిలో

చెట్టు ప్రతిబింబం

*

సూర్యాస్తమయం

ఆస్వాదిస్తూ

ఒంటరి ఒంటె

*

గ్రహణం
విడిచింది
చంద్రుణ్ణి

*

ఎడారి
ముళ్ళపొదలో
ఎర్రని పువ్వు

*

గుట్టలు, చెట్లకు

వీడ్కోలు చెపుతూ

సూర్యుడి అస్తమయం

*

తల్లి

ప్రకృతి

బతుకమ్మ

*

హిమానీనదాలు

ఎన్ని జీవుల

దప్పిక తీరేనో

*

లావా ప్రవాహంలో

జీవం

సజీవ సమాధి


ధన్యవాదములు